# ఎవరు దొంగ?

రాబర్ట్ జేక్సన్ విలాస యాత్రపై రోమ్ వచ్చాడు. "కొలీజియమ్" టూరిస్టు స్పాట్. అది చూడ్డానికని బయలు దేరి అటూ ఇటూ తిరిగి సాయంకాలం అక్కడికి చేరుకొన్నాడు.


ఆ దాపులో కొన్ని టన్నెల్స్ వున్నాయి. అవి చీకటి గుహల్లా వుంటాయి. రాబర్ట్ కాసేపు ఒక టన్నెల్ దగ్గర నిలబడ్డాడు. ఇంతలో పరుగెత్తుతున్న చప్పుడైంది. తన ఆలోచల్ని ఆపి అటుకేసి చూపు సారించాడు. ఎవరో ఒకతను నల్లదుస్తులు వేసుకొని హడావుడిగా పరుగెత్తుకొంటూ రావడం చూశాడు. ఎంతో అత్యవసర పరిస్థితి ఉన్నట్టుగా అతడు పరుగుపెట్టూ వచ్చి రాబర్ట్‌ను ఢీ కొన్నాడు. దాంతో క్రిందపడ్డంత పనైంది రాబర్ట్‌కు. బాలన్స్ తప్పి తూలిపడబోయి తమాయించు కొన్నాడు.

అతడు కావాలని డాష్ ఇచ్చాడాలేక చీకట్లో కనపడక చేశాడా అని అనుకొంటున్న రాబర్ట్‌కు చప్పున ఏదో స్ఫురించి చేయి చూసుకొన్నాడు. వాచ్ మిస్సింగ్. తను పొందిన టోకరా గ్రహించి వెంటనే రాబర్ట్ ఒలంపిక్ పరుగు పందెపు వాడిలా అతను వెళ్ళిన దిక్కుకేసి దూసుకపోయాడు.

ఏదో వెతుకుతూ గాభరా పడుతూ అతడు అక్కడ కనుపించాడు. తన్ను చూసి నటిస్తున్నాడని ఒక్క ఆఘాటున అతడి చొక్కా పట్టుకొని "ఒరోలీజియో" "ఒరోలీజియో!" అని తనకు తెలిసిన ఆ ఒక్క మాటను ఇటలీ భాషలో అరిచాడు. (గడియారం! గడియారం)

అతడికిదేమీ అర్థంకాక తెల్లపోయి భయపడుతున్నట్టు గజగజ వొణికాడు. ఈ హఠాత్ సంఘటనకు బిత్తరపోయి నోరు పెగల్లేదు. అతడి మౌనం రాబర్ట్‌లో కోపం తెప్పించింది. మరీ గట్టిగా చొక్కా గుంజుతూ బిగ్గరగా అరిచాడు. అతడేదో ఇటలీభాషలో గొణిగాడు. రాబర్ట్‌కు అదేమీ అర్థంకాలేదు. కోపంతో ఊపివేస్తూ బెదిరించాడు. అతడేమనుకున్నాడో చివరకు జేబునుండి వాచ్ తీసి యిచ్చి నిరాశగా వెళ్ళిపోయాడు.

"అమ్మ దొంగ వెధవా! తెలియనట్టు బుకాయించబోయాడు! నేనంత తేలిగ్గా




వదుల్తానా! పుటం పెట్టనూ'' అనుకొన్నారు రాబర్ట్.

రాబర్ట్ తృప్తి పడుతూ హోటల్ కెళ్ళగానే మేనేజరు ఎదురొచ్చాడు.

''బ్రేక్‌ఫాస్ట్ తీసుకొంటూ తమరక్కడ మర్చిపోయారు. మీరటు వెళ్ళగానే చూసి జాగ్రత్తచేశా.'' అంటూ ఓ వాచ్ తీసి రాబర్ట్ కిచ్చాడు.

రాబర్ట్ విపరీతంగా ఆశ్చర్యపోతూ 'నా వాచ్ ఇక్కడ మర్చిపోయానా? మరైతే నా దగ్గరున్న వాచ్ ఎవరిదీ?' అంటూ జేబునుండి తీసి పరీక్షగా చూశాడు.

''అరెరె! ఎంత పొరపాటు జరిగింది'' అన్నాడు పీలౌతూ

''ఏం జరిగింది సార్!''

జరిగిందంతా చెప్పి ''అతడెవరో పాపం నన్నొక దొంగ అనుకొని బెదిరిపోయి తన వాచ్ తీసి యిచ్చాడు. నా వాచ్ ఇక్కడ మర్చిపోయినట్టు గుర్తే లేదు. ఇది అతని కెలా చేరవెయ్యడం?'' అన్నాడు రాబర్ట్ చింతిస్తూ తను పరోక్షంగా దొంగైనందుకు.

—కొల్లుకుదురు రాజశేఖరరెడ్డి